# ప్రజా నాయకులు

భమిడిపాటి అనంతరామయ్య



'ఎత్తమంటావా... ఎత్తుకుంటావా...'

'మహాజనులారా .... మరో అర గంటలో కార్యక్రమం మొదలవుతుంది. మంత్రిగారు ఏరోడ్రోం చేరినట్టు ఇప్పుడే ఫోన్ వచ్చింది. మరో పావు గంటలో వచ్చేస్తారు మీరంతా దయ చేసి నిశ్శబ్దంగా ఉండాలి.'

ఈలలు....తప్పట్లు....

'ఇంద....ఇంద .... తీసికో....'

'హలో...హలో...ఒన్...టూ... త్రీ మైక్ టెస్టింగ్...'

'దమ్ మారో దమ్....'

హోటల్ తిలోత్తమా ఆ మహా నగరంలో ఈ మధ్యనే వెలసిల్లిన భూతల స్వర్గం. ఆ సాయంత్రం తిలోత్తమా ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో అగ్ని బాధితుల సహాయార్థం ఒళ్ళు దాచుకోకుండా నాట్యంచేసే జూనియర్ జ్యోతి లక్ష్మి (సినీఫేం)చే బెనిఫిట్‌షో ఏర్పాటు చేశారు. దానికి ముఖ్యఅతిథిగా ఓ మంత్రి

గార్ని పిలిచారు.

సరిగ్గా నెలరోజుల క్రితం ఆ మహా నగరంలో సుమారు ఏడెనిమిది వార్డులలో రోజుకో వార్డు చొప్పున అక్కడక్కడ పూరి పాకలు పరశురామ ప్రీతి అయ్యాయి. ఆ పూరి మార్కెట్టు దగ్గర సుమారు ఐదు వందల పాకలు కాలిపోయాయి. అగ్నిమాపక దళాల వారు పూర్తిగా ఇళ్ళు కాలిపోయాక అర్పడానికి వచ్చారు. మర్నాటి ఉదయం పరామర్శ చేయడానికి ఆ పూరి ఎం. ఎల్. ఏ. ఛైర్మన్, కౌన్సిలర్లు మొదలైన పుర ప్రముఖులు కాలిపోయిన ప్రాంతాలను వార్డులవారీగా చూడడానికి వెళ్ళారు. ఇవన్నీ కొన్ని ప్రతిపక్షాలవారు, తీవ్రవాదులు చేస్తున్నపనులని నచ్చచెప్పారు. చాలా కన్నీళ్ళు కార్చారు. పోలీసు ఎంక్వయిరీలు పెడతామన్నారు. వీరికిసహాయం చెయ్యడానికి డబ్బుకోసం ప్రభుత్వానికి రాస్తామన్నారు. కొత్త ఇళ్ళు కట్టియిచ్చే ఏర్పాటు చేస్తామన్నారు. అక్కడికక్కడే అగ్నిబాధితుల సహాయార్థం ఓ కమిటీ తయారైంది. ఇళ్ళు కాలిపోయినవారి సహాయార్థం ఓ బెనిఫిట్ షో వెయ్యాలని, ఆ డబ్బూ, గవర్నమెంటు ఇచ్చిందీ మొత్తం కలిపి వీరికి తాత్కాలిక సహాయం చెయ్యాలని నిర్ణయం జరిగింది. ఓ మంత్రిగార్ని ముఖ్య అతిథిగా పిలవాలని, కాకినాడ నుండి జూనియర్ జ్యోతిలక్ష్మి (సినీ ఫేం) చే నాట్యం చేయించాలని తీర్మానంచేసి చకచకా పనులు ప్రారంభించారు.

దొనేషన్ టిక్కట్లు ఇంచుమించు అన్ని ప్రభుత్వ ఆఫీసులలోను ఉద్యోగస్తులు వారి వారి హోదాలను బట్టి తీసుకోవలసిందిగా బలవంతంచేసి అమ్మించారు. కొందరు ఉద్యోగస్తులు, గుమాస్తాలు అంత ఎక్కువ డబ్బుతో టిక్కట్లు కొనలేమన్నారు. ఉద్యోగాలు తీసేస్తామని, ట్రాన్స్‌ఫర్లు చేస్తామని, ప్రమోషన్లు ఇవ్వమని బెదిరించి టిక్కట్లు కొనిపించారు. కావలిస్తే ఈ డబ్బు తర్వాత బిల్స్‌లో ఎడ్జస్టు చేసుకోమని సలహా ఇచ్చారు.

పాకలున్నవారు నిద్రపోవటంలేదు. ఇళ్ళు కాలిపోయిన వాళ్ళు మిగిలిన సామానులు తీసుకొని ఊరి చివర మైదానంలో నివాసాలు ఏర్పరచుకొన్నారు.

"చెంగావీ చీర కట్టుకున్న చిన్నదీ
దాని జిమ్మదియ్యా...."

"మహాజనులారా! మీ రంతా నిశ్శబ్దంగా ఉండి కార్యక్రమం జయప్రదం కావించవలసిందిగా కోరుతున్నాం. మంత్రిగారు ఛైర్మన్‌గారు వచ్చేస్తున్నారు. ఎం. ఎల్. ఏ. గారు ఢిల్లీలో పనులవల్ల ఉండిపోయారు. రెండు నిమిషాలలో కార్యక్రమం మొదలవుతుంది.

ఈలలు....తప్పట్లు....

స్టేజి మీద తెర లేచింది.

వెనకాతల గాంధి, నెహ్రూ, ఇందిరా గాంధి ఫొటోలు ఉన్నాయి. ఖద్దరు పంచ ఖద్దరు చొక్కా గల పెద్దమనిషి వేదిక మీదకి వచ్చి నమస్కారం పెట్టాడు.

"ఈయాల(ఇల్లు)కాలిపోయిన వారికి సాయం చెయ్యడానికి ఈ మీటింగెట్టాం. ఈ మీటింగ్‌కు మనూరి సైర్మన్‌గార్ని అద్దెచుకిగా ఉండాలని ప్రార్ధిస్తున్నాను." మంత్రిగార్ని కూడా పైకెక్కమని కోరుతున్నాం.

ఏపిల్ పళ్ళలాంటి బుగ్గలు గ్లాస్కో కంపెనీవారి ఎడ్వర్‌టైజ్‌మెంటు మీద బొమ్మలావున్న ఓ అయిదేళ్ళ బంగారు పాప (బ్లాకు మార్కెటీరుగా పేరుబడి ఆ వూరి ప్రముఖులలో ప్రసిద్ధుడైన, సూపర్ బజార్లలోను, ఎన్నో సొసైటీలలోను డబ్బును మింగిన ముత్యాలరావుగారి ఆఖరి అమ్మాయి) పూలదండ వేసింది. మంత్రిగార్ని ఫోటోలు, దండలు, దండాలు.

మున్సిపల్ హైస్కూల్లో పనిచేస్తున్న యిద్దరు టీచర్లు, నలుగురు అమ్మాయిలూ వేదిక మీదకి వచ్చారు. వందేమాతరం పాడ్డానికి.

చైర్మన్‌గారి అధ్యక్షోపన్యాసం మొదలైంది.

"యియ్యాల నా కెంతో సంతోషంగా వుంది. ఎంచేతంటే మనం ఎన్నాళ్ళబట్టో ఎదురు సూత్తున్న జోతిలచిమి దాన్ని యియాల ఎట్టాం. అంచేత వుపన్యాసాలు బేగి ముగించేద్దాం. ఆర్నెల్ల క్రితం మనూళ్ళో ఫాక్టరీ ఎట్టడానికి మార్కెటుకాడ మైదానాలలో యిళ్ళు కాలీ సెయ్యమని సెప్పాం. మీరు ఇన్నేదు. ఏవో సంగాలన్నారు. సెయ్యం పొమ్మన్నారు. ఆయాలే సేసేటుంటే యీపాటికి మీరు కొత్త యిళ్ళలో ఉండేవారు. అయినా అంతా అయిపోనాది. ఏటి సేత్తాం! ఆ ఏడు కొండలాడికి, సింవాద్రప్పన్నకి మన మీద దయలేదు. ఓ సారే ఏడెనిమిది వార్డులలో యిళ్ళు కాలిపోవడం మనూరి యిష్టరిలో యిదే మొదటిసారి. మేం అంటే కిట్టనివాళ్ళు రౌడీలు ఇలా యిళ్ళు కాల్చేస్తున్నారు. ఇంకమీద మనూళ్ళో యిలాంటి పనులు జరుగకుండా చూస్తాము. దానికి కమిటీ ఏస్తున్నాం. గవర్నమెంటుకి కాకితాలు రాసాం, వారు సాయం సేసారు. అది, ఇయాల యిక్కడ వసూలైందీ కలిపి యిల్లు కాలిపోయిన వారికి సమానంగా పంచేస్తాం. ఇక మీద యిల్లు కాలిపోకుండా పెంకుటిల్లు కట్టించమని ప్రభుత్వం వారికి కాగితాలు రాసాం. ఈ జూన్‌లో ఎన్నికలవుగానే గాంధిగారి పుట్టింరోజు కాడికి మీకు కొత్త ఇల్లు కట్టి ఇచ్చే ఏర్పాటు సేత్తాం. ఇంతకన్న నేను సెప్పేదేటినేదు నాకు యియాల ఇలా రెండు ముక్కలు సెప్ప

దానికి పిల్చినందుకు మీకు దండాలు. యిక మంత్రిగోరు రెండు ముక్కలు సెప్తారు.

తప్పట్లు....

మంత్రిగారు మైకు దగ్గిరకువచ్చారు.

రెండు దగ్గులు దగ్గారు.

ఓసారి మైకులో చిటిక వేశారు.

ఓసారి చూపులతో ఆ ప్రదేశం సర్వే చేశారు.

పోలీసు బందోబస్తు బాగా వుందని తెలుసుకు కుదుటపడ్డారు.

'మహాజనులారా !

ఇవాళ చాలా సుదినం. నాకు ఎన్నో పన్లున్నా ఛైర్మన్‌గారి్నంచి, ఎం. ఎల్. ఏ. గారి నుంచి ట్రంకాల్స్ రాగానే తక్కిన ప్రోగ్రాం అంతా కాన్సిల్ చేసుకు వచ్చాను. మీ ఊళ్ళో ఒకచోట కాదు, రెండుచోట్ల కాదు సుమారు ఏడెనిమిది వార్డులలో వరసగా ఇళ్ళు కాలిపోయాయి. అంటే ఇవి ప్రమాదవశాత్తు కాలిపోయినవి కావు. ప్రతిపక్షాల వారు, తీవ్రవాదులు, దుండగులు, సంఘ వ్యతిరేక శక్తులు మేం అంటే కిట్టని వాళ్ళు చేస్తున్న పనులు ఇవి. ఇక మీద ఇలాంటివి జరుగకుండా గట్టి చర్యలు తీసుకొంటామని మనవి చేస్తున్నాను. అనుమానం వున్న ప్రతివార్నీ జైల్లో వేస్తాం. మీ ఊళ్లో ఇళ్ళు మాత్రమే కాలాయి. ఇతర రాష్ట్రాల్లో, ఊళ్ళల్లో అక్కడ సంఘ వ్యతిరేక శక్తులు గృహ దహనాలేకాదు షాపుల మీద, గోడౌన్ల మీద పడి లూటీలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తిని, ప్రయివేటు ఆస్తిని ఎంతో నష్టం చేస్తున్నారు. అరాచకాన్ని పెంచుతున్నారు. అంచేత అలాంటి చోట మిలట్రీని దింపుతున్నాం. మనం గాంధిగారి అడుగుజాడలలోనే నడవాలి. మనకు ఏది కావాలన్న మన కోరికలు శాంతియుతంగానే చెప్పాలి. మీ ఊరికి తొందరలోనే ఒక పెద్దఫ్యాక్టరీ వస్తున్నది. (తప్పట్లు) నిరుద్యోగ సమస్య ఉండదు. (తప్పట్లు) వసతిలేనివారికి ఇళ్ళు కట్టిస్తున్నాం (తప్పట్లు) మొన్న నేను ఢిల్లీ వెళ్ళినపుడు ప్రధానమంత్రితో రెండురోజులు చర్చించాను. (ఒక్కసారి అక్కడ అశోకా హోటల్‌లో ఆ రెండురోజులు గడిపిన బెంగాలీ యువతి షీలా జ్ఞాపకంవచ్చి పెదిమలు చప్పరించారు. ఏం మాట్లాడుతున్నారో మర్చిపోయారు. ముందు వరసలో కూర్చున్న పంజాబీ యువతి పక్క చూశారు. వెనకాతల నిలబడ్డ చొక్కాలు లేని అస్థిపంజరాల లాంటి మానవాకారాలు చూశారు. ఛైర్మన్ గారు అగ్గిపుల్ల గీసి సిగరెట్టు ముట్టించారు)

ఆఁ... ఇవాళ అగ్నిబాధితులకు నా చేతిమీదుగా సహాయం చెయ్యడం నాకు ఎంతో సంతోషంగా వుంది. అందుకే

సుదినం అన్నాను. కాని చాలా పెద్ద లిస్టులున్నాయి. సుమారు పన్నెండు వందలు ఇళ్లు కాలిపోయాయి. ఇవాల్టి, కలెక్షన్ పదివేల రూపాయలు ప్రభుత్వంవారు ఇచ్చిన సహాయం యాభై వేల రూపాయలు, మొత్తం అరవై వేల రూపాయలు 1200 కుటుంబాలకి పంచాలి. అంటే ఇల్లు కాలిపోయిన ఒకో కుటుంబానికి యాభై రూపాయలు వస్తాయి. ఇంతమందికి నేను ఇవ్వడం మొదలు పెడితే వ్యవధి చాలదు. తర్వాత మీరంతా ఎదురు చూస్తున్న డాన్స్ ప్రోగ్రాం ఉంది.'

కమిటీ సెక్రటరీ అయిన ఓ కౌన్సిలర్ వేదిక మీదకి వచ్చి ఓ ప్రకటన చేశాడు.

'మహా జనులారా.... క్షమించండి .. రేపు ఉదయం ఎనిమిది గంటల నుండి రాత్రి ఎనిమిది గంటలవరకూ గాంధి మార్కెట్టు ఎదురుగా అగ్ని ప్రమాదాలలో ఇళ్ళు కాలిపోయిన వారికి సహాయం చేసేశిబిరం ఒకటి పెడుతున్నాం. అక్కడికి ఇల్లు కాలిపోయినవారు వచ్చి వారికి రావలసిన యాభై రూపాయలు తీసుకోవలసిందిగా ప్రార్థిస్తున్నాను '

సెక్రటరీ వెళ్ళి పోయాడు.

మంత్రిగారు ఉపన్యాసం తిరిగి మొదలు పెట్టారు.

'మీరంతా డాన్స్‌చూసే తొందరలో వున్నారు. నా ఉపన్యాసం ముగిం చేస్తున్నాను. మీకు ఫ్యాక్టరీ, కొత్త ఇళ్లు అక్టోబర్ ప్రాంతానికి వస్తాయని వాగ్దానం చేస్తున్నాను. జూన్‌లో ఎన్నికలు జరుగుతాయి. సంఘ వ్యతిరేక శక్తులకు చేయూత ఇవ్వకండి. గాంధి నెహ్రూల అడుగుజాడలలో నడవడం మర్చిపోకండి' జైహింద్.

తప్పట్లు

అంతా వేదికదిగి ముందు వరసలలో కుర్చీలలో కూర్చున్నారు.

తెరపడింది.

'మహా జనులారా, రెండు నిమిషాలలో మీరంతా ఎదురుచూస్తున్న తనజీవితాన్నే నాట్య కళకి అంకితం చేసిన మిస్ జూనియర్ జ్యోతిలక్ష్మి డాన్స్ రెండు నిమిషాలలో మొదలవుతుంది.

తెరలేచింది.

"రా.... రా....నారాజా... " పాటకు అనుగుణంగా నాట్యం.

ఒంటిమీద బట్టలు చాలా పొదుపుగా వాడుంది. ఆమె వంపు సొంపులు చూడ్డానికి అనుగుణంగా ఆడియన్స్ తల లూపుతుంటారు.

రాత్రి పదయింది.

ఛైర్మన్‌గారు ఛైర్మన్ అయిన మొదటి సంవత్సరంలో కొన్న యాభై వేల రూపాయలు ఖరీదు చేసే మినీ మేడలో మంత్రిగార్కి పార్టీ జరుగుతున్నది. కమిటీ సభ్యులు తప్ప ఇంకె

వ్వరూ లేరు.

"ఈసారి మన పార్టీకి దెబ్బలేదు. అపర చాణక్యుడివయ్యా!" అన్నారు మంత్రిగారు.

"సిత్తం .... ఈ సారైనా నన్ను ఎమ్. ఎల్. య్యే సెయ్యాల. ప్రజలు మన్నే నమ్మారు. వాగ్దానాలన్నీ సేసాం... ఎన్నికల్లో మన పార్టీయే నెగ్గుతుంది" అన్నారు ఛైర్మన్.

"నాకు ఎం.ఎల్.ఏ, మీ ఎం.ఎల్.ఏ.కి మినిష్టరు ఖాయం."

"అంతా మీ సలవ."

"కలక్షన్ ఎంత వచ్చింది?"

"సెప్పయ్యా కోశాధికారి!"

ఎస్. ఎస్. ఎల్. సి జన్మలో పాసవనని తేల్చేసుకున్నాక కంట్రాక్టరుగా చేరి కౌన్సిలర్ అయిన ఆ కమటీ కోశాధికారి చిన్నారావు పద్దుపుస్తకం తీశారు.

"గవర్నమెంటు ఇచ్చింది యాభైవేలు. డాన్స్ కలక్షన్ అరవైవేలు మొత్తం లక్షపదివేల రూపాయలు కలక్షన్.

ఖర్చులు: ఇళ్లు కాల్చడానికి మనిషికి ఐదువందల చొప్పున ఏడుగురికి మూడు వేల ఐదువందలు.

కాలిపోయిన ఎనిమిది వందల ఇళ్ళకి ఇంటికి యాభైరూపాయల చొప్పున నలభైవేల రూపాయలు.

"అపద్దంతా చదవక్కర్లేదు. మొత్తం ఎంత మిగిలిందో చెప్పు" అన్నారు మంత్రిగారు.

"అరవైవేల రూపాయలు మిగిలాయి."

పద్దుపుస్తకం చూపించాడు కోశాధికారి.

"ఇందులో పదివేలు ఎలక్షన్ ఫండు క్రింద తియ్యండి. మిగిలింది వాటాలు వెయ్యండి ఎం. ఎల్. ఏ. వాటా ఇక్కడికి వచ్చినపుడు ఇవ్వండి. ఆ పద్దుపుస్తకం వెంటనే తగలెట్టెయ్యండిక" అన్నారు మంత్రి.

"సిత్తం"

"మా రెక్కట్టు దగ్గిర ఇంక మా బొమ్మర్ది ఫ్యాక్టరీ కట్టుకోవచ్చన్నమాట అడిగారు" మంత్రిగారు

* * *

ఆర్నెల్ల తరువాత—

ఛైర్మన్‌గారు ఎం.ఎల్.ఏ అయ్యారు. ఎం. ఎల్. ఏ గారు మంత్రిగారయారు. మంత్రిగారు మరో మెట్టుపైకి వెళ్ళారు. మంత్రిగారు వాగ్దానం చేసిన ప్రకారం మార్కెట్టు దగ్గిర ఇళ్ళు కాలిపోయిన స్థలంలో ఒక ఫ్యాక్టరీ కడుతున్నారు. ఇళ్ళు కాలిపోయిన వారు యాభై రూపాయలు తీసుకొని ఊరికి దూరంలో మైదానాలలో కర్ర కంపా చెత్తా చెదారంతో గూళ్లు కట్టుకున్నారు. వారిలో కొందరికి ప్రస్తుతం నిరుద్యోగ సమస్య తప్పింది, ఫ్యాక్టరీ కడుతున్నారుగా. వీరిలో కొందరు అందులో కూలీలుగా చేరారు.